# కరోనామహమ్మారి పై కవితాసంకలనం




COURTESY : SRI TUNIKI BHOOPATI, CARTOONIST

## డాక్టర్ అర్జా శ్రీకాంత్,

## రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక  కార్యదర్శి

## ఎండి, సీఈవో, ఎపిఎస్ఎస్డిసి

## స్టేట్ నోడల్ ఆఫీసర్, కోవిడ్-19



**ముందుమాట**

ప్రపంచాన్నంతటినీ కుదిపేసిన సంఘటనలు, విలయాలు చాలా అరుదు. అలాంటి అరుదైన సంఘటనల్లో కోవిడ్-19 వైరస్ ఒకటి. చైనాలోని వూహాన్ నగరంలో వెలుగులోకి వచ్చిన ఈ వైరస్ ప్రపంచంలోని అన్ని దేశాలకు విస్తరించింది.

కోట్లాది మంది ప్రజలకి సోకి, లక్షలాది మందిని బలితీసుకుంది. కోవిడ్ వ్యాప్తి అధికంగా ఉన్న దేశాల్లో మన దేశం కూడా ఒకటి. మరణాలు కూడా భారీగా ఉన్నాయి. కోవిడ్ పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా ఇంకా వైరస్ పై సందేహాలు, అపోహాలు తొలగడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో 'కలం స్నేహితులు' బృందం లోని 36 మంది కవులు కోవిడ్ మహమ్మారిపై అవగాహన కల్పించేలా మంచి మంచి కవితలు రాయడం సంతోషించదగ్గ విషయం.

ఈ కవితలను అన్నింటినీ ఒక సంకలనంగా తీసుకురావాలన్న 'కలం స్నేహితులు' బృందం ఆలోచన అభినందనీయం.
ఈ కవితా సంకలనాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.

ఈ కవితా సంకలనానికి మందుమాట రాసే అవకాశం దక్కడం ఎంతో సంతోషంగా ఉంది. భవిష్యత్తులోనూ 'కలం స్నేహితులు' బృందం ఇలాంటి సామాజికపరమైన అంశాలపై అవగాహన కల్పించేలా ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

అభినందనలతో..

డాక్టర్ అర్జా శ్రీకాంత్, రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక  కార్యదర్శి
ఎండి, సీఈవో, ఎపిఎస్ఎస్డిసి
స్టేట్ నోడల్ ఆఫీసర్, కోవిడ్-19
తేది   19-9-2020

| | |
|---|---|
| **బలివాడ సత్యారావు**<br>**కలం స్నేహితులు అడ్మిన్ బృందం**<br>**విశాఖపట్నం 9963344957** |  |

**<u>అధ్యక్షుల వారి తొలిపలుకులు</u>**

**గౌరవ సభ్యులందరికి నమస్సుమాంజలి. మన కలం స్నేహితులు అడ్మిన్ ల బృందంలో ఒకరయిన శ్రీ సదాశివుని లక్ష్మణరావు గారు మనవాట్సాప్ గ్రూపులోని కవుల నుండి సేకరించిన కవితలన్నీ జతచేసి "కరోనామహమ్మారి పై కవితాసంకలనం" పేరుతో అద్వితీయమైన ఈ- బుక్ తీసుకువస్తున్నట్టు తెలిసి సంతోషించుచున్నాను. మన సభ్యులందరి తరఫున వారికి నా అభినందనలు తెలియజేస్తున్నాను.**

**ఈ సంకలనమును మీ ముందు ఉంచుచున్నందుకు సంతోషించుచున్నాను. దీనిని సాహిత్యాభిలాషులైన మీరందరూ ఆదరిస్తారని కోరుతున్నాను. మీ అమూల్యమైన అభిప్రాయాలు నాకు (9963344957) గాని లేదా శ్రీ సదాశివుని లక్ష్మణరావుగారికి (9247783307) గాని మెసేజ్ ద్వారా తెలపగలరు.**

**కలం స్నేహితులు నభూతో నభవిష్యతి అన్నట్లు ముందుకు సాగాలని ఆశిస్తూ! మీ అందరి ఆదరాభిమానాలతో**

**మీ బలివాడ సత్యారావు**
**కలం స్నేహితులు అడ్మిన్ బృందం**
**విశాఖపట్నం 9963344957**

# కరోనా మహమ్మారి పై కవితలు

**28-5-2020 నాడు "అమ్మకోసం" అనే టైటిల్ తో మొదటి కవితాసంకలనం పిడియఫ్ ఈ-బుక్ విడుదల చేయడం జరిగినది. తదుపరి 8-8-2020 నాడు "సింహాచలం పుణ్యక్షేత్రం పై కవితాసంకలనం" విడుదలచేయడం జరిగినది. అయితే లాక్ డౌన్ సమయంలో మన "కలం స్నేహితులు" సభ్యులు ఎక్కువగా కరోనా మహమ్మారి పై అవగాహన కల్పించేవి, ఆశాజనకమైనవి మంచిమంచి కవితలు రాయడం చేశారు. అవన్నీకూడా ఒక సంకలనం తీసుకురావడానికి నిశ్చయించి , అడిగినదే తడవుగా 36 మంది కవులు తమ కవితలు పంపారు. వారికి నా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అవన్నీకూడా ఈ సంకలనంలో పొందుపరచాము.**

**నా తోటికార్టూనిస్టు శ్రీ టి భూపతి గారి సౌజన్యంతో వారి కార్టూనును ముఖచిత్రంగా వేయడంజరిగినది. వారికి నా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను**

**"కలం స్నేహితులు" అడ్మిన్ లు శ్రీ బలివాడ సత్యారావుగారికి, శ్రీ కరకవలస గౌరీప్రసాద్ గారికి, శ్రీ బలివాడ హరిబాబుగారికి మరియు డా. డబ్బీరు గోవిందరావుగార్లకు నా ప్రత్యేక ధన్యవాదాలు.**

**సంపాదకులు**

**సదాశివుని లక్ష్మణరావు**
**19-9-2020**

## 1.నోరు లేని జీవాల శాపనార్థాలు

## కుప్పిలి భీమేశ్వరరావు .విశాఖపట్నం. 8121629421

భయ పడే రోజులు భవిష్యత్తుకు గుర్తులా?

భయమ్ వాకిట ముగ్గులు రాబోయే రోజులా?

పరుగెత్తే కాల చక్రానికి చైను జారిపోయిందా?

ఎటో పోతున్న కాలానికి ఇవి చిన్న బ్రేకులా?

బ్రతుకు భారమై నడుస్తున్న రోజుల్లో

కాలం ఎంత గొప్పదో, సామాన్యుని జీవితంలో

కూలాడితే గాని కుండాడని వలస కూలీలకు

కరోణ కాలం నడకే నాపై నడిపించింది

రగులుతున్న గుండెల్లో యెండుతున్న గొంతులు

పట్టెడు మెతుకుల కోసం పడరాని పాట్లు

నోరు లేని జీవాల శాపనార్థాల తో

మారిందీ జన జీవనం రాగం లేని వీణలా!

***

## 2.క్రిమి భరతం పట్టరా (గేయకవిత)

## బెలగాం భీమేశ్వరరావు9989537835

ఇది మాయదారి జబ్బురా

మహమ్మారి జబ్బురా

మందు లేని సందు చూసి

మహిని ఆక్రమించెరా

కరోనాగ పుట్టెనురా

కాలనాగు అయ్యెనురా

కంటికి కనిపించకుండ

కాటు వేయ చూచునురా

మతమేదో చూడదురా
ప్రాంతమేదో కనదురా
మనిషి నుంచి మనిషికి
వ్యాప్తి చేయ చూచునురా

అభివృద్ధిని ఆపునురా
అయోమయం చేయునురా
శ్రమ సంపద సృష్టి నాపి
పేదరికం పెంచునురా
కళ్ళు లేని రక్కసిరా
దారి లోని కాయునురా
ఎవరు అటుగ వచ్చినను
వారి మీద పడునురా
సూక్ష్మ రూపు కలదిరా
అతిగ బాధ పెట్టునురా
కట్టడి చెయ్యక పోతే
కల్లోలం చేయునురా
ఆరోగ్యం ముఖ్యంరా
ఆదాయం కాదురా
బతికుంటే ఆదాయం
తిరిగి పొంద వచ్చురా
ప్రాణాలే మిన్నవిరా
పోకిరిగా తిరగకురా
మందు లేని ఆ జబ్బుకు
ఇల్లే కడు పదిలంరా
ఉదాసీన మొద్దురా
ఉపద్రవం కోరకురా
లాక్ డౌన్ కి సహకరించి
ప్రాణం కాపాడుకొనురా

***

## 3.కరోనా కల్లోలం లో  వలస బతుకు వెతలు

## మోటూరి నారాయణరావు  హైదరాబాద్  సెల్ : 9346250304

పల్లెల్లో బతుకులు

బరువై

పట్టణంలో

బతుకుదామని

ఊరు వదలే

వలసకూలి

కూటికోసం

కూలి కోసం

బయలు దేరే

బాటసారి

దుక్కి దున్నే  బక్కరైతు

సాగుచేసే  అన్నదాత

పట్నం మొచ్చి ఆగమయ్యే

కూలి సరిగా దొరకదాయె

కడుపు మాడి పస్తులాయె

అంతలోనే పుట్టుకొచ్చే

విషపు కోరల

రాకాసి పురుగు

పుడమి పైకి

దూసుకొచ్చే

కంటికే కనిపించని

శత్రువు

జనంపైకి దాడిచేసే

మనిషి ఊపిరి తీసే

కూలి ముఖం వాడిపాయె

పనులు లేక చిక్కిపోయె

సర్కారీ లాకుడౌన్ కు

ఆగిపోయే కూలి పనులు

పూటగడవని

వలస కూలి

కడుపుకట్టుకు పండుడాయే

తిరిగి  పల్లెకు పయనమాయే

రైలు లేదు

బస్సు రాదు

రవాణా

సౌకర్యాలు బందు

తారుపూసిన

రహదారులు

ఎర్ర నిప్పుల

సెగల మాటున

దారిలోన

పొదల చాటుగా

వందల మైళ్ల పయనం

అడుగు పెట్టే.. నడక సాగే ..

ఒకరెనకన

మరియొకరు

తట్ట బుట్ట

తలకు కట్టి

గుడ్డ ముక్కను

మెడకు చుట్టి

రాత్రి లేదు

పగలు లేదు

ఎండలేదు

వానలేదు

నడిరోడ్డుపై

నడకయాతన

ముళ్లు దిగిన పాదాలు

కళ్లునిండగ కన్నీరు

చంకలోన చంటోడు

దారిపొడుగునా

ఆకలి కేకల ఆర్తనాదాలు

ఎవరికీ రావద్దు ఈ కష్టాలు

పయనమైన దారిలోన

పట్టెడు మెతుకులకై

పరుగులు

పేగుల లోగిళ్లలో

పస్తుల కుంపట్లు

ఎసరుకు బియ్యం

అందితే ఎగిరి

గంతేసే  విస్తళ్లు

బతుకుంటే

బలుసాకైనా

సూపరు

బతికిపోవాలనే

ఆరాటమే బెటరు

కాళ్లకు కాలిన గాయాలు

బీటలువారిన  పాదాలు

గమ్యం దూరమైన లెక్కచేయని లక్ష్యంతో

సొంతూళ్లకు

పయనం కట్టారు...

ఆరని ఆకలి దీపాలై

బతుకు నడక

సాగుతోంది.

వలస కూలీల

జీవన నౌకా యానం

ఇంకా కొనసాగుతూనే ఉంటుంది.

***

## 4.కూల్చి వేద్దాం(కరోనా ని)

లయస్ శివాజీ పట్నాయక్   ఎలియాస్ సింహాచలం విశాఖపట్నం -7995681836

కూల్చి వేద్దాం(కరోనా ని)

నిరంతరం మాస్క్ లు ధరించడం

బయటకు వెళ్తే దూరం పాటించడం

పరి శుభ్రత తో నిత్యం ఉండడం

జన జీవన స్రవంతి లో

ఇలా యున్నప్పటికి-

దహించు కు పోతున్నావు

కన్పించే జీవరాశులను-

దావానలం లా సాగిస్తున్నావు

పరాకాష్ట లో ప్రాణాలెన్నెన్నో?!

దాక్షిణ్యంబు కరువాయె పుడమి పై

దావాంతం బాంబు లేదాయె

మూకమ్మిడ గ  దమించు దాం!

యున్నది ధన్యుడుగ దబ్రం

హరిస్తున్నందున పిడికిళ్లలో జనం

లోకాన పరులిడె మదోట్కంలా

దుష్కృతం ను దుర్ఘాంత

మోందించ్-

దారదం తో నిండియున్న మహమ్మారిని

మసరుతో దమనం చేసెద్దాం

దరిదాపులు గా దప్పళమైంది

గంధనం గలదాన్ని దాత్రం చిరాకులతో!

దారదముని అంత మోందించుదాం

అల్లకల్లోలితం చేస్తున్న రక్కసిని త్రుంచుదాం

అల్లకల్లోలితం చేస్తున్న రక్కసి ని త్రుంచుదాం

దుముకులాడు చున్న కర్కశి క్రుత్యంబు

దాపరించిందని భావించి కూల్చివేద్దాం!

***

## 5. తస్మాత్ భద్రం

## ఎవిఎస్ పట్నాయక్ వైజాగ్ 77805 92451

మన చుట్టూ చీమలు ఉన్నట్లే

మన చుట్టూ దోమలు ఉన్నట్లే

మన చుట్టూ పురుగులు ఉన్నట్లే

మన చుట్టూ కరోనాలు ఉన్నాయి

జూస్ యమడేంజరని తెలిసికో

జోరుగా కరోనా ఉధృతవుతూంది

ఎవరో ఏదో చెపుతున్నారని

నమ్మకు నమ్మకు తమ్ముడూ

నీకు నీవే కాపాడుకో

నీకు నీవే డాక్టర్

నీకు నీవే పోలిస్

నీకు నీవే సేవకుడవు

బయటకు రాకు

కరోనా తీసికురాకు

ఎవరిని తీసుకుపోకు

శుభం శుభం నీకు

***

## 6 భయం...భయం...

## కొర్లాం సనత్ కుమార్ గాజువాక, విశాఖపట్నం. 9248412674

వంటగదిలో శ్రీమతి వేసిన తాళింపుకు వచ్చిన తుమ్ములకు భయం...భయం...

బయటకు వెళ్ళే అవకాశం లేక నోటిని ఓ 'మిక్సీ'లా మార్చి ఖాళీ లేకుండా రోజంతా ఆరగిస్తూ

ఖాయాన్ని భారీగా పెంచి భవిష్యత్ లో వచ్చే జబ్బులు గుర్తుకొచ్చినందుకు భయం...భయం...

మండు వేసవిలో శారీరక స్వాంతనా కోసం రోజంతా ఏ.సి రూమ్ లలో గడిపిన ఫలితానికి వచ్చిన కరెంట్ బిల్ చూసి

వంట్లో వేడి పెరిగినందుకు భయం...భయం...

పిల్లలు ఇంటినే ఓ మైదానంలా మార్చి ఇంట్లో వస్తువులను, ఆటవస్తువులుగా మార్చినందుకు భయం...భయం...

మాస్కులతో ముఖాలు మూసుకున్నవేళ

ఎవరు... ఎవరికి.... ఎవరోనని గుర్తుపట్టడములో విఫలమైనందుకు భయం...భయం..

***

## 7.మానవాళి జర భద్రం.

## బాసంగి లక్ష్మీకాంతమ్మ గాజువాక, విశాఖపట్నం 9032488203

కరోన... కరోన.... కరోన....

మానవ  తప్పిదాలకు  ప్రకృతి ఇచ్చిన ఝలక్

ఉరకలు పరుగుల జీవితానికి పడింది 'బ్రేక్'

యావన్మంది ఉద్యోగులు బహుపరాక్

మన ఆర్థికరంగాన్ని చేసింది ' షేక్'

విందు వినోదాలలోనూ బహుపరాక్

ఆలింగనం తో సంస్కారమనుకొనే అ-నాగరికత నుండి

నమస్కారం తో రెండు చేతులు జోడించే నాగరికత ఆరోగ్యమని ప్రపంచానికి చాటుదాం.

ప్రభుత్వ సడలింపులు"లాక్ డౌన్" కే పరిమితం.

అందుకే,  సమస్త మానవాళి జర భద్రం.

***

## 8.బహు పరాక్ ! బుద్ధిమంతుడ్ని నేనండి!

## సదాశివుని లక్ష్మణరావు వైజాగు 9247783307

దూరం దూరం జరగండి

బుద్ధిమంతుడ్ని నేనండి

విదేశం నుంచి వచ్చానండి

విమానం ఇపుడే దిగానండి

చెకింగు చేయగ రారండి

చెకింగు కానిదే పోనండి

చెకింగు చేసినా వేరే ఉంటా

రెండువారాలు మా ఇంటా

పడకుండా ఎవ్వరి కంటా

వేరే గదిలో పడుకుంటా .॥దూరం॥

విమానం దిగిన వారెవ్వరూ

పారిపోకుండా దాగిపోకుండా

చెకింగు చేయించేశా వదలకుండా

బాధ్యతతో బుద్ధిమంతుడిలా.

జలుబూ దగ్గూ జ్వరమైనా

కోవిడ్ కరోనావైరస్ లేదన్నా

అంటూ గింటూ లేదన్నా

నన్ను తాకగ ఎవరూ రావద్దన్నా…॥దూరం॥

క్రితం సారి వచ్చినపుడు

బాగా దగ్గరికి వచ్చారు

గుండెలకు హత్తుకున్నారు

కరచాలనం కూడా చేశారు.

ఇపుడుమాత్రం అలా వద్దన్నా

నమస్కారం మాత్రం చేయన్నా

ఆరడుగుల దూరం ఉండన్నా

అందరి ఆరోగ్యం కోసమె అన్నా ॥దూరం॥

సబ్బుతో చేతులు కడుగన్నా

ముఖానికి మాస్కు తొడుగన్నా

బయటి తిండిని తినకన్నా

ఇంటివంటనే తినరన్నా

కొంచెం కొంచెం మంచినీటిని

గొంతు తడిసేలా పొయ్యి నోటిని
వానలో మంచులో అట్టే తడవకు
మామూలు జలుబు దరికి రానివ్వకు ॥దూరం॥

ఇంటి పట్టునే ఉండన్నా
బజారువేపు పోకన్నా
తుమ్మూ దగ్గూ వచ్చినపుడు
రుమాలుని అడ్డం పెట్టన్నా.

డాక్టరు వద్దకు ఆసుపత్రికి
వెళ్ళవద్దురా చిన్నవాటికి
బ్యాంకు పనైనా ఆఫీసు పనైనా
మొబైలుఫోనులో చిటికెలో చేసెయ్ ॥దూరం॥

మిత్రుల కోసం ఏవైనా
పరివారంకోసం కొన్నైనా
గిఫ్టులు ఎక్కువతేలేదన్నా
తెచ్చినవాటిని తాకొద్దన్నా.

వికారిగా వచ్చిన ఈ మహమ్మారి
శార్వరి రాత్రితో పారిపోగానే
మళ్ళీసారి నేనొచ్చేటపుడు
మీకోసం బోలెడు గిఫ్టులు తెస్తా..॥దూరం॥
***

## 9.కరోనా పెను సవాల్

## హరిబాబు బలివాడ  కంచరపాలెం విశాఖపట్నం 9494745837

ఉహాస్ లో పుట్టిన వైరస్  కరోనా
ఊహకందని విలయం సృష్టించింది ఈ జగాన
పెను సవాల్ విసిరిందిపుడు మానవజాతికి
ఎలా ఎదుర్కుంటావో చూస్తానని

ఆశల ఆకాశంలో విహరిస్తున్న

ఓ నరుడా

అంతరిక్షాన్నే జయించానంటున్న

ఓ మానవుడా

నన్నెలా ఎలా అంతం చేస్తావో చూస్తాను

అంటున్నదిపుడు

పెను సవాల్ విసురుతున్నదిపుడు

కరోనా మహాభూతం హెచ్చరిస్తున్నదిపుడు

నేను సృష్టించిన మహా ప్రళయం నుండి

ఎలా బయట పడుతావో చూస్తానంటున్నదిపుడు

ఏం చేసి తప్పుకుంటావోనని హేళన చేస్తున్నదిపుడు

మాయల మారి కరోనా రోగం

కనువిప్పు కావాలి మనకు

జిత్తులమారి కరోనా రోగం

పెను సవాల్ విసురుతున్నదిపుడు

ఐనా, ఏడాదికో కొత్త రోగం వస్తున్నదిపుడు

సవాల్ చేస్తున్నదిపుడు

ఏం చేస్తావో చూస్తామని

వైరస్ ల కుటుంబం మూకుమ్మడిగా దాడిచేస్తున్నదిపుడు

ఒక ఎయిడ్స్, ఓ కరోనా,ఓ బర్డ్ ఫ్లూ ఇంకా పేర్లు ఏవైనా

హెచ్చరిక ఒక్కటే

అదే మానవజాతి వినాశనం

ఎందుకనో మానవజాతిపై పగబట్టినట్లే

అనిపిస్తోంది ప్రకృతి

వైరస్ ల రూపంలో ప్రకృతి హెచ్చరిస్తున్నదిపుడు

విఱ్ఱవీగుతున్న ఓ మానవుడా

దమ్ముంటే ఎదుర్కోనన్నిపుడని ,

చేతనైనది చేసుకొమ్మని

...పరిహాసమాడుతున్నట్లుగా అనిపిస్తోంది

ప్రకృతి హెచ్చరిస్తున్నదిపుడు

వరదలు, భూకంపాలు, పెను తుఫానుల

రూపంలో,

సందేశమిస్తున్నదిపుడు ఓ మానవుడా నీవేం అధికుడవు కావు,

ప్రకృతిలో ఒక భాగమేనని,

ఎక్కువగా విఱ్ఱవీగబోకుమని.

ఐనా కరోనా నేర్పింది గుణపాఠం

దేశాలు ఏవైనా, మతాలు కులాలు ఎన్నున్నా

తనకేమీ తేడా లేదని

అందరినీ సమానంగా కబళిస్తానని

మానవ జాతి నేర్చింది పెనుపాఠం

తన తోటి వాడి క్షేమమే తన క్షేమమని

ధనిక, పేద తేడాలొద్దని

కులమతాలు కృత్రిమమేనని

ఏ దేశమేగినా

కుటుంబమే గమ్య స్థానమని

మానవజాతి చైతన్యమే ఏకైక మార్గమని

సోదరుడా ఈ సవాల్ ను ఎదుర్కుందాం

సామాజిక దూరం పాటిద్దాం

చేయి చేయి కలపకుండానే

కాలు బయట పెట్టకుండానే

కరోనా పై పైచేయి సాధించుదాం

మానవజాతిని సంరక్షించుకుందాం.

మానవజాతికిపుడు పెను భూతం ఈ కరోనా

సామాజిక చైతన్యం తప్ప లేదు మార్గం ఏ కోశానా

లేకుండా చేద్దాం కరోనా రోగాన్ని ఈ జగాన

అన్ని పోరాటాలకు ఉద్యమాలకు చేయి చేయి కలపడమే

ఏకైక మార్గం

దుష్ట కరోనా పై పోరాటానికి చేయి చేయి కలపకపోవడమే

మిగిలిన మార్గం

కాలు బయట పెట్టకపోవడమే ఖచ్చిత మార్గం

సామాజిక దూరమే సన్మార్గం.

***

## 10. నాకు నేనే నిషేధాన్ని

## రఘుపాత్రుని శ్రీనివాసరావు  శ్రీకాకుళం 9491810283

అవును ఇప్పుడు నాకు నేనే నిషిద్ధం
అడుగు వేయాల్సినప్పుడల్లా
వేయిసార్లు ఆలోచిస్తున్నాను
దేన్ని తాకాలన్నా గజగజ వణుకుతున్నాను
చీపురుపుల్ల కొనాలన్నా
చదరంగంలో సైనికుడిలా
గడుల్లో నిలబడాల్సి వస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు
ఆఖరికి పాల పేకెట్టుకు కూడా అభ్యంగన స్నానం చేయించాకనే
ఇంటి లోపలికి ఆహ్వానించాల్సి వస్తుందని అనుకోలేదు
కొనుక్కున్న ప్రతి వస్తువునూ
సేనిటైజర్ తో శుభ్రం చేసే రోజు ఒకటి వస్తుందని ఊహనైనా ఊహించలేదు
ప్రాణం లేని పదార్థాలపై
ప్రాణం తీసే క్రిమి ఏదో ప్రాణం పోసుకుని పొంచి ఉందని తెలియలేదు
ఉమ్మి అసహ్యమనే తెలుసు
కానీ దాని భయానక రూపం ఇలా ఉంటుందని తెలియదు
తుమ్ము అపశకునమనే తెలుసు
దానికి మరో రూపు ఇస్తే అది కరోనాయై కాటేస్తుందని తెలియదు
రోజు రోజుకీ దాని విశ్వరూపం
విశ్వమంతా అల్లేస్తుంటే
నిర్దాక్షిణ్యంగా వ్యవస్థల్ని ఛిద్రం చేసేస్తుంటే
ఎప్పుడొస్తుందో తెలియని వ్యాక్సిన్ కోసం
శాస్త్ర వేత్తల దేవుళ్ళకు కోటి మొక్కులు మొక్కుతూ
ప్రాణాలకు తెగించి పోరాడుతున్న వైద్యులకు ప్రణమిల్లుతూ
ఆపద్బాంధవుల్లా కనిపిస్తున్న పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులు
ఇంకా ఇంకా ఎందరో నేతలు, అధికారులకు వందనాలు అర్పిస్తూ
కాసింత దగ్గుకూ..కూసింత జలుబుకూ..
అనుమానితుడిగా మిగిలిపోతున్న నిషిద్ధ మానవుణ్ని..

భౌతిక దూర మనే ఖడ్గంతో..

దూరం నుంచి యుద్ధాన్ని కొనసాగిస్తున్న వీరుణ్ణి

నాకూ ఓరోజు వస్తుంది

ఆ రోజు కరోనా రక్కసి కోరలు పీకి

విశ్వ యవనికపై

విజయ గీతిక అలపించడానికి

అంతవరకూ ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి

నాకు నేనే విధించుకుని

నాకు నేనే గిరి గీసుకొని

నాకు నేనే ప్రకటించుకున్న నిషేధాన్ని..

***

## 11.కరోనశతకం।।


## జన్ను మహంతి వెంకటచంద్ర బాబు 80748 00939


**చేతిలోన గ్లోవు చెవిపైకి ఒకమాస్కు.......**

**చెంత నెపుడు మంచి శానిటైజర్ .....**

**ఉండినంత గాని బయటికి పోరాదు।।**

**రెండు చేతులెత్తి నిండైన దండంబు.....**

**నేర్పు కొలది పెట్టు నీటుగాన...**

**షేకు హ్యాండు అనుచు చేతులస్ కలపకు !!**

**ఎంత వారలైన ఎదురుపడిన గాని....**

**దూరముండు దరిజేర బోక....**

**వారి తుమ్ము దగ్గు వారుణాస్త్రము నమ్ము!!**

**ఫ్లాట్లు, కార్లు, సైట్లు బ్యాంకు బాలన్సులుస్....**

**ఏవి నిన్ను కావ వెంటరావు...**

**చావుగా కరోన సరస జేరగ నీకు !!**

**మందు లేదు దీని మర్మమ్ము చూడగా....**

బాల వృద్ధులకును ప్రాణ భయము....

శుద్ధి శ్రద్ధ ఒకటె దీని నాప గలదు!!

స్వీయ   నియంత్రణ... స్వీయ రక్ష నీకు.........

అదే శ్రీ రామరక్ష ...సమాజమునకు!!

***

## 12. కరోనా పై విజయానికి ఆయుధమిదే

**ములగ  రాధాకృష్ణ, టీచర్ బొబ్బిలి. 94919 04370**

నేను మానవుణ్ణి
ఇంకో రూపంలో దానవుణ్ణి
నా చరిత్రకు నేను కాదు కారకుణ్ణి
నా భవిష్యత్తుకి నేను కాదు బాధ్యుణ్ణి
కానీ..
నా వర్తమానానికి నేనే నాయకుణ్ణి
నా అభివృద్ధి తంత్రంలో మునిగి
నా స్వార్ధపు కుతంత్రం ఎగసి
నా తరంతో  యుగాంతానికి నేనే దారులు తెరచి
దిక్కులన్నీ నావేనని విర్రవీగిన నేను
నేడు దిక్కులేని చావుకు దగ్గరయ్యాను.

నింగికెగసి నాట్యమాడిన నేను
నేడు నేలాబారు చూపులతో నిశ్చేష్టుడునయ్యాను.

సనాతన సంస్కృతికి మంటపెట్టి,
సరికొత్త సాంకేతికతను ఒంటబట్టి,
ప్రాధమిక ఆరోగ్యసూత్రాలు బొంద పెట్టి,
పాశవిక వికృత చేష్టల బాటపట్టి,
నేను చేసిన ఘనకార్యానికి ప్రతిఫలం
విశ్వవ్యాప్తమైన కరోనా విష ప్రళయం.
ఈ ప్రళయంలో తడిసి 'మట్టి' అవకుండా ఉండాలంటే

నువ్వేమీ కష్టపడక్కర్లేదు

నువ్వేమీ కనిపెట్టక్కర్లేదు

ఇంటిపట్టున ఉంటే చాలు

నాకేరోగమొచ్చినా నేనున్నానన్న

వైద్య నారాయణులు కరోనా కాటుకు బలౌవుతున్నా వెరవక,

కంటికి రెప్పలా కాపాడే ఖాకీలను

కరోనా కలవర పెట్టినా కాస్తైనా కుంగక,

పారిశుద్ధ్య కార్మికులు పరేషాస్ అవుతున్నా,

ప్రాణాలు ఫణంగా పెట్టి పోరాడుతున్న తీరు

నాకు, నా సమాజానికి ఈజన్మకు తీర్చుకోలేని రుణం.

నేను నమ్మిన ముక్కోటి దేవతలు మాట అంటుంచితే

నాకోసం నిలబడ్డ పై ముగ్గురు దేవుళ్ళే నిజమైన దేవుళ్ళు.

నాకోసం సర్కారు నిబంధించిన గృహ నిర్బంధం

కాదు నాకు శాపం

నా ప్రాణాలు కాపాడుకోమని

గృహమనే తల్లిగర్భంలో తలదాచుకోమని ఓ వరం

అక్కరకురాని ఆర్థికబంధాలకై పరుగులుతీసిన నాకు

ఆదరించే ఆత్మబంధాలవిలువ తెలిసొచ్చిన తరుణం

విరామానికే విరామమిచ్చి వృత్తినిర్వహణలో విసుగెత్తిన నాకు

విలుపైన వ్యక్తిత్వ విలువలు నేర్చుకునే సమయం

ఇప్పటికైనా మించిపోయింది ఏమీ లేదు

వ్యక్తిగత పరిశుభ్రత పాటిద్దాం,

పరిసరాలను ప్రక్షాళన చేద్దాం,

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం,

ఇంట్లోనే ఉంటూ

నిజమైన ప్రేమను పొందుదాం

కరోనా మీద విజయానికి ఇంతకుమించి

వేరే ఆయుధం లేదని నిరూపిద్దాం.

***

## 13. శ్రీమన్నారాయణుడు ఎవరి రూపంలోవస్తాడో చూడాలి మరి

కుప్పిలి రాజేశ్వరి పట్నాయక్ , విజయనగరం 9441757304

కంటికి కనిపించని " కరోనా "
కలికాలాన్ని కకావికలం చేసి,
కల్లోలంలో పడవేసి
కనువిందు చేసుకుంటున్నావా?
మహామేధావులమని విర్రవీగిన
మానవుల మేధస్సు కు సవాలపైనిలచావు
ఎవరు నిస్సృష్టికర్త, ఎలాపుట్టేవు,
ఎక్కడపుట్టావు, ఎలావిజృంభించావు,
ఎప్పుడు నీ నిష్క్రమణ ప్రప ంచమంతా
ఆతృతతో ఎదురుచూస్తున్నది
నీ చావు వార్తకోసం మానవులచే
సృష్టించబడి మానవులసే కబళిస్తున్న
నిన్ను చూస్తూఉంటే పూర్వం  పురాణాలలో
చెప్పబడిన భస్మాసురకదగుర్తుకు వస్తోంది
నీవు భస్మాసురుడవు అమాయకపు
మానవులు భోళా సెంకరుడు.
మరి శ్రీమన్నారాయణుడు
ఎవరి రూపంలోవస్తాడో చూడాలి మరి
***

## 14. కరోనానినాదాలు

కుదమ తిరుమలరావు రాజాం మండలం, శ్రీకాకుళం జిల్లా.  9505665748

జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత,  HM, MPUP School, కొత్తవలస

1)  "కరోనాకి లేదు కరుణ-
మందుఒక్కటే స్వీయనియంత్రణ"

2) " సామాజిక దూరం" పాటించాలీ జగతి-

అప్పుడే కరోనాకి చితి"

3) "కరోనాకి భౌతిక దూరమే  సమాధి-

దూరం పాటించుటే మనందరి విధి"

4) "ఒంటరిపై నువ్వుంటే-

కరోనాని తరుముటే"

5) "ముఖానికి వేయు ముసుగు-

కరోనా కాగల్లు కనుమరుగు"

6) "అవనికిఆధారం వందనం-

అదే కరోనాకి ఖననం"

7) "లాక్ డౌన్ ని సహిద్దాం-

కరోనాకి లాకప్ చేద్దాం"

8) "విర్రవీగకు కరోనా

విరుగుడుంది సుమా"

9) "కరోనాకి చితి-

పేర్చునులే జగతి"

10) "కరోనాకి త్వరలోనే-

చిరునామా చితిలోనే"

11) "కరోనాకి విరుగుడుంది-

మానవాళికా చరిత ఉంది"

12) "కరోనా కాస్కో-

వెలివేస్తాం చూస్కో"

13) "శుభం కార్డు కరోనాకి-

శుభ్రజగతి జనానికి"

14) "విరుగుడుమందు ఖాయం-

కరోనాకి తప్పదు ఖతం"

15) "తప్పకా వస్తాయి మందులు-

కరోనాకి చెప్తాం వీడ్కోలు"

16) "కరోనాకి చరమగీతం-

కనిపెడుతున్నారు వైద్యబృందం"

17) "త్వరలోనే మందులు-

కరోనాకి చావుఘడియలు"

18) "కరోనాకి దొరకబోము-

కరచాలనం చేయబోము"

19) "చేయిచేయి కలపబోము-

కరోనాకి చిక్కబోము"

20) "పాటిస్తాం సామాజికదూరం-

కరోనాని అంతంచేస్తాం"

21) "ఇల్లుదాటి వెళ్ళబోం-

కరోనాకి తెచ్చుకోం"

22) "కరోనా రహిత సమాజం-

కచ్చితంగా సాధించి తీరుతాం"

***

## 15. **కరోనా కాలం అంతా అయోమయం**

గౌరిప్రసాద్ కరకవలస..గాజువాక 9440326093.

అనుకోకుండా అన్నదమ్ముని ఇంటికి వెళ్ళిన అమ్మను చూద్దామంటే ఎదురుగా కరోనా...

నాలుగు వసంతాలు నిండిన మనవడి ముచ్చట్లతో ఆడుకొందా మని కొడుకు ఇంటికి వెల్దామంటే ఎదురుగా కరోనా...

మనవరాలి భారసాల బ్రహ్మానందంగా జరుపుకుని తీసుకొద్దామని ముహూర్తం పెడితే ఎదురుగా కరోనా..

అమ్మను చూడలేను.. మనవడితో ఆడలేను.. మనవరాలి ఊసూలతో తెలియాడలేను. ఏమనిచెప్పను.ఎలాచెప్పనునా మదిలో బాధను..

ఇంకా ఎవరితో నైనా పంచుకుందామంటే ఇల్లు దాటలేను ఎదురుగా కరోనా...

అన్నింటికీ మనమే కారణమా..

ప్రకృతి విరుద్ధపనులే మనకు శాపమా..

మాన వాలి ముప్పుకు ఇది ఆరంభమా..

మనమందరం కలసి తోడుగా చేయూత ఇవ్వలేమా..

ధరణిని.. మానవాళి ని రక్షించుటకు మనమంతా

ఏకమవ్వాలని అందరికి చెప్పలే మా..

ఇంటిపట్టునుండు..చేతులుకడుగుతుండు..

సామాజిక దూరాన్ని పాటిస్తుండు..

ఆరోగ్య పరి రక్షణకు కృషి చేస్తా ఉండు..

అని నలుగురుతో విషయం పంచలేమా..

ఏది ఏమైన ,""కరోనా కాలం..అంతా..అయోమయం""..

***

## 16. ఆ భగవంతుడికే తెలియాలి

## పోలాకి అప్పారావు 94413 81329

ఈరోజు యావత్ భారతావని కి ,ఒకటే దీక్ష ,

కరోనా వైరస్ భూతాన్ని, ఎలా దీనిని ఎదుర్కోవాలని,

పాలకులు పరి తపిస్తూ న్నా, ఏ విధంగా దీనిని ఎదుర్కోవాలని

అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు .

వైద్య బృందాలు శ్రమిస్తున్నారు.

పరిసరాల శుభ్రత తో, ఉంచడానికి శ్రామికులు కష్టపడుతున్నారు.

వృద్ధులు ఇంటికే పరిమితమై ,జీవన గమనం సాగి స్తున్నారు

గర్భిణీలు మా రెండు ప్రాణాలు ఎలా ఈడు తాయని ,

చిన్నారి పిల్లలు ఆట పాటలు లేవని రోదిస్తున్నారు .

ఎప్పటికీ ఈ మరణ మృదంగం సమాప్తి అవుతుందో,

ఆ భగవంతుడికే తెలియాలి.

***

## 17. మహమ్మారి కరోన పై అవగాహన

బో గెల ఉమా మహేశ్వర రావు (ఉమా కవి) శ్రీకాకుళం 94913 25714

మనిషి బుద్ధి జీవి

తిరుగులేని నిర్ణయాత్మక వ్యక్తిత్వ మతనిది

ఎదిరించలేని వాటినైనా ఒంటరినిచేసి

వేటాడే సింహనీతం చాణక్యబోధ- లాక్ డౌన్ .

ప్రమాదపు కాలానికి అప్రమత్తతకు దారి.

అదే అగోచర శత్రువుపై ఎదురుదాడి నేర్పు.

ఏకాదేకం-స్వీయ నియంత్రణ (వళ్ళు దగ్గర పెట్టుకోవడం) మరొక సూత్రం.

కాంతి కిరణాల శక్తి , (విటమిన్ డి)శుద్ధకషాయాలు

అర్ఘ్య పాద్య ఆచమనీయా లు, గాలి వడపోత కవచాలు(మాస్కులు),

సమూహముసమస్యలమయం,

ఒంటరి తనమే అభయం.

వేక్సిన్లు వచ్చేలోగా, శత్రువునునిలురించేఉపాయం,

దాడి చేసి ,అడ్డుకట్ట వేసి,

ఆట కట్టించే చతురంగపుటెత్తులు,

,ఇవన్నీ కరోనా నిర్మూలన కవచాలు.

ప్రకృతి నేర్పిన గుణపాఠాలు.

స్వీయ దోషాల అవగాహనలు

అప్రమత్తతకు మార్గాలు.

రోగం కూడా ఒక గురువై నేర్పింది గుణపాఠం.

నేర్చిన విషయమిక నిను వీడునే ,మరల తప్పిదముసేయ.? ,

భయభ్రాంతులు వీడి ఆత్మ స్థైర్యము తో శత్రువును అంతమొందించు నందాక,

విశ్రమించక పరాక్రమించెదం.

మనుగడలో మెలకువలే నివారణా మార్గాలు.

***

## 18. కరోనా వచ్చిందిరన్నో

వాడాడ చంద్రశేఖరరావు విశాఖపట్నం 9618145957

కరోనా వచ్చిందిరన్నో.. చాలా జాగ్రత్తగుండాలిరన్నో.. (2)

అందునా ఇందున ప్రతిదేశమందునా.. (2)

పిట్టల్లా మనుషుల్ని పట్టి చంపేస్తుంది..

|| కరోనా ||

చరణం :1

చైనాలో పుట్టింది రన్నో.. అన్నిదేశాల కొచ్చింది రన్నో (2)

ఘోరమైన వైరస్ రన్నో.. నువ్వు దూరంగా ఉండాలి రన్నో (2)

నాకేమిగాదని దర్జాగతిరిగితే (2)

ఇంటిల్లపాదికి ఇబ్బంది లొస్తాయి

||కరోనా ||

చరణం :2

ఇటలీలో చూడరోరన్నో..

ఎన్ని ప్రాణాలు బలిగొంది రన్నో (2)

స్పెయిన్ లో చూడరోరన్నో.. పెద్ద శవాలగుట్ట రోరన్నో (2)

అగ్రరాజ్యం అమెరికాఅల్లాడి పోతుంటే.. (2)

దిక్కులేకప్రజలు దీనంగచూస్తుండ్రు..

|| కరోనా ||

షేక్ హ్యాండ్ ఇవ్వొద్దురన్నో.. చాలాచిక్కుల్లో పడతావు రన్నో (2)

దూరాన్ని పాటించు రన్నో.. దుమ్మి, ధూలిలో తిరగొద్దు రన్నో (2)

దగ్గొచి, జ్వరమొచ్చి, వొళ్ళునొప్పులు వొస్తే(2)

వెంటనే డాక్టర్ని సంప్రదించాలన్న..

|| కరోనా ||

పరిసరాల శుభ్రతన్నో.. మనము పాటించి తీరాలి రన్నో(2)

ఇల్లు, వొళ్ళు శుభ్రతన్నో.. అదిపాటించి తీరాలి రన్నో (2)

ఎన్ని వొచ్చిన గాని.. ఏమిచేయవు మనకు..(2)

ఎదిరించి నిలబడితే విజయమే మనదిరా!! ||కరోనా ||

***

## 19. కరోనా


## చౌదరి వివేకలక్ష్మి , సింగపూర్ 95509 81647


క ర్కశమై కంటతడిపెట్టిస్తున్న కరోనా

రో దనలే

వికటాహాసమై ప్రభళమైన... నీ

నా మముకన్నా చిరునామాతో

గడగడలాడిస్తూన్నావు ....

క లెక్టర్ అయినా కార్మికుడైనా

రో గనిరోధకశక్తి లేకుంటే

నా శనం చేస్తూ ప్రజలను వణికిస్తున్నావు .

అతిధివనుకున్నాము

ఊపిరితిత్తి నే స్థిరనివాసం చేసుకుని ప్రాణాంతకమైనావు

ముట్టుకుంటే ముప్పు

ఇంటి గడప దాటితే తప్పు

రహదారులు మూసుకున్నాయి

అనుబంధాలు తల్లడిల్లాయి

తల్లి బిడ్డ లను అక్కున చేర్చుకున్నేదేప్పుడో...

అక్కాతమ్ముళ్లు

కలుసుకున్నేదేప్పుడో....

పుట్టింట్లో పాదంమోపెదెప్పుడో ... మెట్టినింట్లో నడయాదెప్పుడో...

బ్రతుకు మీద ఆశ లేదు

భయపడని రోజు లేదు

నిశ్శబ్దం నిరాశ నిస్పృహ

ఇది ఇప్పటి కరోనా పాలిస్తున్న జీవితం .....

Mars లో అడుగు పెట్టి విజ్ఞత చాటుకున్నాము ...

ప్రకృతిమాత సరిహద్దు రేఖ దాటినామనిమరిచిపోయేము ...

మన్నింపు మహదేవ

శరణ్యం నీ పాదకమలం ....

***

## 20.తరిమేద్దాం

డి.జి.యస్.శ్రీనివాస్ గజపతినగరం 90301 56140

ప:  అమ్మలార! జాగరత

అయ్యలార!జాగరత

అక్కలార!అన్నలార!

అందరూ జాగరత

చ: చైనా నుండి వచ్చింది

చెంప పగలగొట్టింది

ప్రపంచానికంతటికీ

పెనుముప్పు తెచ్చింది

చ: మన ప్రధాని మోదీజీ

మంచిమాటలెన్నో చెప్పి

మనందర్ని బంధించి

మహాక్రతువు మొదలుపెట్టె

చ:  పోలీసుల ధీరత్వం

డాక్టర్ల ఔదార్యం

నర్సుల సౌజన్యం

మన పాలిట అది వరం

చ: కార్మికుల కష్టాలు

కర్షకుల త్యాగాలు

మహనీయుల దానాలు

మన రక్షణ కవచాలు

చ: పరిశుభ్రత పాటిద్దాం

'దూరాన్ని' చాటేద్దాం

కలిసికట్టుగ మనమంతా

కరోనాను తరిమేద్దాం

***

## 21. జాగ్రత్త! జాగ్రత్త!

బెహరా ఉమామహేశ్వరరావు పార్వతీపురం  9290061336

అన్యం పుణ్యం ఎరుగని బాలలు

కల్లా కపటం తెలియని పిల్లలు

ఆట పాటల ముద్దుల పాపలు

దేవుని రూపానికి ప్రతి రూపాలు

వారంటే నీకెందుకు రోషం

మూడు కాళ్ళతో సాగే బ్రతుకులు

అనుభవాలతో నిండిన వృద్ధులు

యువతరానికి మార్గదర్శకులు

నిత్యం సత్యం తలచే దార్శనికులు

వయో వృద్ధులపై నీ ప్రతాపమా

యువతీ యువకుల విడువని నీవు

మానవజాతి పై నీకెందుకు పగ

రూపం లేని నీవొక దగా

నీటిలో, గాలిలో తిరుగుతావట....

కాళ్లు చేతులు సబ్బుతో కడుగుతూ

మా ఇల్లు, ఒళ్ళు శుభ్రం తెలుసు

ఊరు వాడ పరిశుభ్రం చేస్తాం

వేడి ఆహారం మా ఆరోగ్యం

మనిషికి మనిషి దూరం ఉంటూ

నిన్నే దూరం దూరం తరిమేస్తాం

మహమ్మారి ఓ దురహంకారి

కరుణలేని ఓ కరోనా చూడు

నిన్ను మట్టి పెట్టగలం ఇక నేడు

భారతదేశం మందు

నిను ముంచే ఇక ముందు...

రష్యా మందు నీ రోగం కడతేర్చగ

వచ్చే! జాగ్రత్త!!

***

## 22. అభివందనం  పూలమాలలు

## పక్కి రవి శేఖర్ సత్యనారాయణ మూర్తి  బొబ్బిలి 9505813468

అభివందనం !!

మా వందనాలు అందుకుండి

రక్షక భటుల రా !!

విద్యుత్ వైద్యాలను అందించే ఘనులారా !!

పారిశుద్ధ్య కార్మిక .మీడియా మిత్రులారా !!

స్వచ్ఛందంగా సేవ చేయు ధీరు  లారా  !!

ప్రభుత్వ ఉద్యోగస్తులు  వాలెంటీర్లల దయగలవాలకు ఇవియే మా పూలమాలలు !!

ఇవే మా పూలమాలలు !!

అందుకుం డి త్యాగమూర్తు లా రా  !!

ఇల్లు దాటి రానట్టి సహనానికి పరీక్ష  !!!

అధిగమిస్తే అదే నేడు దేశానికి రక్ష  !!

కరొన సంక్రమణకు ఆప గలుగు ఔషధము !!

మహమ్మారి కో విడ్ ను తరిమికొట్టు ఆయుధం  !!

స్వీయ నియంత్రణ ఒక్కటే మన పక్షాన కర్తవ్యం  !!

సామాజిక దూరం క్రమశిక్షణతో పాటిద్దాం !!

మీ సహనమే మీ విజయం  !!

భారతీయులారాఇవే మీకు పూలమాలలు

ఇవిఏ మీకు పూలమాలలు!!

***

## 23.కరోనా నిష్క్రమణ

## బెహరా నాగభూషణరావు గజపతినగరం 94400 59186

సైన్స్ కే  సవాల్ విసిరి

ప్రపంచాన్నే గడగడలాడించి

విర్రవీగే స్వార్ధానికి బుద్ధినిచెప్పి

శాంతినిఅశాంతి చేసి  ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసి

అడుగు వర్గాన్ని అట్టడుగు  వర్గానిగ చేసి

ప్రభుత్వాలను గడగడలాడించి

అంతర్జాతీయ సమస్యలను మరింత పెంచి

డాక్టర్లను ,పోలీసులను, పనివారిని, యంత్రాంగాన్ని తీరిక లేకుండా చేసి

వలస జీవుల ఆక్రందనలతో

బడుగు జీవుల స్వేద రక్తం తో

అన్నార్తుల అడవి రోదనలతో

కంటిమీద కునుకు లేకుండా చేసి

పది వాక్యాలు కూడా వ్రాయ లేని పది పిల్లలను ఉత్తీర్ణులు చేసి

కాలేజీ అంటే కాల్  + ఏజ్ అనుకొనే ఇంటర్ పిల్లలను పాస్ చేసి

ఏది విజ్ఞానమొ  ఏది అజ్ఞానమొ

తేల్చుకోలేని సమస్యా సమాజాన్ని సృష్టించి

విపరీతార్థాలుకుమూలమై

రేగుతూ  చెలరేగుతూ

మా గుండెలను బరువెక్కించి రోదనలనుమిన్నంటించి

బాంధవ్యాలను దూరంచేసి

కన్నీళ్లను  స్రవింపచేసి

వికృత నీ పిశాచక బుద్ధితో

గడగడలాడించే కరోనా

చాలించు నీ పైశాచికం

అదిగో నీపై ప్రచ్ఛన్నయుద్ధం

ఇక నీ గతి అధోగతే

అందుకే నిస్క్రమించుతక్షణం

***

## 24. గతి - జగతి

## శేఖరమంత్రి ప్రభాకర్ పూనే, మహారాష్ట్ర 9885874474

ఉర్వి జనులను వణికించె ఒక కరోన
గర్వ మడచెను మానవ ఘనుల మతిని
కనబడని చేయి కబలించె జనత భవిత
కఠిన నియమాల భారతి ఘనత గాంచె

జగతి గతిని మార్చిన జాన ఇదియె
ప్రగతి చక్రాల బ్రేకులు పడెను నేడు
రాజ్య దినచర్య మార్చేసిన రక్కసి ఇది
ఇంటి పట్టున నందరి నంటి బెట్టె

గుడుల నన్నియు ఈనాడు గడియ బెట్టి
ధూప దీప నైవేద్యాలు దొరకు చుండ
పూజలన్నియు రీతిగ పూర్తి చేయ
దైవమానంద మందెను తరిచి చూడ

వన్య జీవులు పూజింప భక్తి తోడ
భక్తుల జాడలు లేకను రక్తి లేక
పుణ్య క్షేత్రాలు వెలవెల బోయె నేడు
కాల మహిమను తప్పించు ఘనులు లేరు
***

## 25. ఏమిటిది..ఎందుకిది?

## బాసంగి సురేష్ కుమార్ 9440513634

ఏమిటిది ఎందుకిది
ఎన్నాళ్ళిది ఇంకెన్నాళ్లిది
అసలేం నేరం చేశామని
ఇంటిలోనే బందీలయ్యాం

**ఆలోచిస్తే అనిపిస్తోంది**

**మెల్ల మెల్లగా తెలిసొస్తుంది**

**అంతులేని మన నేరాలకు**

**అంతిమ తీర్పే ఈ శిక్ష అని**

**చందమామను  చూపించి గోరుముద్దలు తినిపించిన**

**అమ్మనెక్కడ చూసుకున్నాం**

**చేయి పట్టుకు నడిపించి**

**బ్రతుకు బాట చూపించిన**

**నాన్ననెక్కడ దాచుకున్నాం**

**ఊరిలోనే వాళ్ళనొదిలి**

**విశ్వమంతా  తిరుగుతున్నాం**

**పచ్చపచ్చగ కనులపండగ**

**పంటపండిన నేల ఎక్కడ**

**చల్లగాలితో ఊపిరిచ్చిన**

**ఇంటిముందర చెట్టులెక్కడ**

**నేలనమ్మిచెట్లు కొట్టి**

**కాలనీలు కట్టుకున్నాం**

**వావివరసకు విలువ వుందా**

**ఆడపిల్లలకు రక్షనుందా**

**మంచితనానికి చోటు ఉందా**

**మానవత్వం బ్రతికి ఉందా**

**స్వార్ధం, మోసం**

**అవినీతి, బంధు ప్రీతి**

**నాలుగు దిక్కులై నలిపేస్తుంటే**

**తప్పనిసరియై ప్రకృతి కన్నెర్రచేస్తే**

**పేద, గొప్ప తేడా లేదు**

**దేశం మతం బేధం లేదు**

**అంత ఒకటే,...**

*******

## 26. అభయ హస్తం అందించు స్వామీ!

## బలివాడ సత్యారావు విశాఖపట్నం9963344957

ప్రపంచమే
దానోహమై
ప్రకృతి ఒడిలో
విలవిల లాడి
మానవాళి
మనుగడ
చేజారిన వేళ
ఏ నోట విన్నా
ఏ భాషలో అయినా
పలికించిన పదం
కరోన కల్లోలం
దేశ ఆర్థిక పరిస్థితి
చిన్నాబిన్నం
చేసిన సూక్ష్మరాక్షసి
శ్రీ కృష్ణజన్మాష్టమి నాడైన
ఆ దేవదేవుడు అంతమొందిస్తాడేమో
నన్న ఆశ కాని
కరోన పాపం కూడ
కంసుడు సంహారంలా
తప్పులు లెక్కలేస్తున్నాడేమో!
మానవ మనుగడ  మారణహోమం అవుతుంటే
ఎన్నాళ్లకు వచ్చునో
వ్యాక్సన్ రాక
దేశవ్యాప్త జనులను
వ్యాపించిన
 మహమ్మారి
కట్టడి ఏ మార్గమో!
మానవాళి కేది

సుమార్గం

చూపించుమా!

ఏ అవతారం లో

వచ్చునో

ఈ రాక్షసి

అంతానికి

దుష్టులను శిక్షించే

నీవు

ఏ రూపంలో వచ్చెదవో స్వామి

కరుణించే కారుణ్యమూర్తి

ఈ జీవితాలకి మబ్బు తొలిగేదెప్పుడో

ఆశయం తో జీవించే

బ్రతుకులకు అభయ

హస్తం అందించు స్వామీ!

***

## 27.కరోనా సంహారం...

మానాపురం రాజా చంద్రశేఖర్, విజయనగరం, 9440593910

లక్ష్మణ రేఖ దాటడానికి

రామబాణాన్ని మించిన ఆజ్ఞ

ఈ కర్మభూమిలో ఏదీ లేదు

భూమి పుత్రిక సీతను ఎత్తుకెళ్లడానికి

రావణుడు పన్నిన మాయోపాయం

చివరికి ఫలించిందేమో కాని..

పాచిక మాత్రం పారలేదు

యుద్ధభూమి గొప్పతనం అదే..

ధర్మాన్ని రక్షించి న్యాయాన్ని నిలబెట్టడం

ఈ సంధి కాలంలో యుద్ధ సమయాన్ని

పరీక్షించి.. పరిరక్షించింది... అంతే

అది రాముడైనా రావణుడైనా మానవుడైనా

చివరికి ధర్మరక్షణ ఒక్కటే

శత్రుసంహారణే భూమిపై గెలుపుమంత్రం

ఇది ఒక అనాది తత్వసారం

కొత్తగా భాష్యం చెప్పేది ఏముంది

సహనం విజయ లక్షణం

ధర్మ సంస్థాపనే సంహరణ లక్ష్యం

సనాతన కాలం నుంచి..

పాటిస్తూ వచ్చిన ధర్మాచరణే ఇది

మానవ కరోనా సంహారం

చాలిచీమల మధ్య బంధీగా చిక్కిన

విషసర్పం కథ ఏమైంది

సత్యభామ విసిరిన బాణానికి

నరకుడి చరిత్ర ఎలా ముగిసింది

పాండవుల ప్రతాపానికి కురుసైన్యం

మిడిసిపాటు ఎలా అంతమైంది

చరిత్ర చెప్పిన తార్కిక ధర్మ మర్మం ఇదే

ఓర్పు గెలుపుకి మూల బీజం

కాలమైతే మారింది కాని..

మనస్తత్వాల్లో మార్పు రాలేదు

సమస్యకి పరిష్కారం ఎప్పుడూ ఒక్కటే

దుష్ట శిక్షణ.. శిష్ట రక్షణ...

కర్తవ్య నిర్వహణకి పోరాటం అనివార్యం

ప్రపంచ దేశాల ప్రజలకి స్ఫూర్తి ఇదే

కృత.. త్రేత.. ద్వాపర.. కలియుగాల్లో

దుష్ట శిక్షణకి ఉన్న ఏకైక దారి ఇదే

ఈ విష సూక్ష్మ క్రిమిది ఏ అదృశ్య

రూపమైనా మినహాయింపు లేదు

మనిషి చేతిలో కరోనా సంహారం తప్పదు

***

# 28. కరోనా ను జయిద్దాం..

ఉరిటి సూర్య ప్రసాదరావు, శ్రీకాకుళం, ఫోన్ 9440115929

కరోనా పేరెత్తితే హడల్

బారిన పడితే ఢమాల్

కొన్నాళ్ళుగా అంతా డల్

ముందుకు సాగని డీల్

సాఫ్ట్వేర్ అంతా వర్క్ ఫ్రమ్ హోం

లాక్డౌన్ తో అంతా కామ్

అభివృద్ధి పనులంతా జామ్

ప్రేవేటు ఉద్యోగుల స్థితే  నో సేప్

చాలా కుటుంబాలు వీధి పాలు

ఎంతో మంది ఆసుపత్రి పాలు

వీధి వీధికి కంటోన్మెంట్లు

ఇంటి ఇంటికి పేషెంట్లు

మారిన జీవన స్థితిగతులు

చక్కదిద్దని ఆర్థిక పరిస్థితులు

పూట గడవక ఇబ్బందులు

ఎప్పటికీ మారెనో ఈ అసమానతలు

అదిగో ఇదిగో అని ప్రకటనలు

ఆశగా ప్రజల ఎదురు చూపులు

వ్యాక్సిన్ కోసం పడిగాపులు

అంతా వరకు తప్పదు పాట్లు

ముందుకు సాగుదాం ఆత్మ విశ్వాసంతో

కదులుదాం తగిన జాగ్రత్తలతో

పని చేద్దాం భౌతిక దూరంతో

జయిద్దాం మనో నిబ్బరంతో

***

## 29. ఆశే శ్వాసగా ....

పి. లక్ష్మణ్ రావ్  అసిస్టెంట్ రిజిస్ట్రార్  సహకార శాఖ  విజయనగరం 9441215989

చీకటిని వత్తి చేసి

ఆత్మవిశ్వాసపు చమురుపోసి

కరోనా అంతానికి

ఆశల దీపాల్ని వెలిగించాల్సిన సమయమిది

కరోనా అనుభవ శకలాల నుంచే

పాఠాలు నేర్చుకొని

అభేధ్య శ్వాస(దేహ) కుడ్యాల్ని

నిర్మించుకోవాల్సిన సందర్భమిది

కాలం అప్పుడప్పుడూ శాడిస్ట్ అయి

గాయం చేస్తూనే ఉంటుంది

మరలా స్పెషలిస్ట్ అయి

తానే నయం చేస్తుంది!

జలఖడ్గమై

తుఫాన్ ఝుళిపించే కాలం

ఆకుపచ్చని సంతకమై

ఆశలు రేకెత్తించడం రివాజే !

శిశిరమై ఆకులు రాల్చే కాలం

వసంతరాగమై పూలజల్లు కురిపించడం

మనకు తెలియంది కాదు !

కష్టాల సుడిగుండం మాటున

సుఖాల జేగంటలెన్నిసార్లు మ్రోగలేదు !

ఉలి దెబ్బలతోనే శిల శిల్పమౌతుంది

కష్టాలు విజయానికి పరీక్ష

నష్టాలు గుండె నిబ్బరానికి చికిత్స !

మానవ బలహీనతల్ని బహిర్గతం చేసి

భవిష్యత్తుని జాగృతం చేసింది కరోనా !

వర్తమాన అద్దం పగిలి

భవిష్యత్తు బహుముఖీనమైంది

గాయం ఉమ్మడిగా తగిలి

ఐకమత్యం విశ్వవ్యాప్తమైంది!

ఇప్పుడు ప్రపంచం పిడికిలి

కరోనాపై పిడుగై పడుతుంది

కరోనా అంతంతో

నవనవోన్మేష శకం ఆరంభమౌతుంది !

***

## 30. కరోనా

## కుప్పిలి వెంకట రమణ, శ్రీకాకుళం. 9440426394

అతిథిగా వచ్చిందనుకున్నా....

లాక్ డౌన్ కారణంగా

అలిగి వెళిపోతుందనుకున్నా ...

కానీ...

తలచినదే జరిగినదా దైవం ఎందులకు?

అని ఓ సినీ కవి అన్నట్టుగా

ఊహకందని రీతిలో దేశం లో తిష్ఠ వేసి

మరణమృదంగంవాయిస్తూ...

కరతాళ నృత్యం చేసుకుంటూ....

ఊరూరూ తిరుగుతుందని

మనుషులను అంటరానివాళ్ళను చేస్తుందని...

శ్రమ జీవుల క్షుద్బాధను పెంచుతుందని...

పాకిస్తానీ ఉగ్రవాదులకన్నా

ప్రమాదకరంగా మారుతుందని...

సంఘజీవిని కాస్తా ఒంటరిని చేస్తూ

ఎవరినీ, దేనినీ

అంటలేక.... ముట్టలేక....

భయం గుప్పిట్లో జనం
మాస్కులు, శానిటైజర్లూ,మందుల కోసం
ఖర్చుచేస్తూ ఉంటే...
కరోనా అంటే
" క లిలో జనం రో దిస్తారు నా వలన" అని
ముందు యుగంలోని రక్కసులెవరో
వైరస్ రూపంలో చూపుతున్న ప్రతాపం అని తెలిసి...
వాక్సిన్ కై ఎదురుచూస్తూ...
కరోనాకి కాలం చెల్లిందనే "శుభవార్త "అందరూ వినాలని కోరుకుంటూ....
సర్వేజనాః సుఖినోభవంతు
***

## 31. కరోనావైరస్ "అ " నుండి "క్ష" వరకుఅక్షరక్రమకవిత

## అరసాడసూర్యనారాయణరావు విశాఖపట్నం 9885118272

"అ"రుదైనవ్యాధికరోనావైరస్రూపంలోవిస్తరిస్తోందిఎల్లెడలా ,
"ఆ"క్రన్దనలువినిపిస్తున్నాయిప్రపంచంలోప్రతీచోటా,
"ఇ"ళ్లకేపరిమితమవుతున్నారుజనంతప్పనిసరిపరిస్థితుల్లో ,
"ఈ"షణ్మాత్రమైనఅలసత్వంప్రదర్శిస్తేఫలితాన్నిఉహించలేవుకలలోనైనా ,
"ఉ"న్నచోట,ఉన్న ఇంట్లోస్వీయగృహనిర్బంధంలోఉండడమేఈవైరస్నియంత్రణకుఏకైక పరిష్కారం
"ఊ"ళ్లకుఊళ్లేస్వచ్ఛందంగానిర్బంధించుకొంటున్నాయిస్వీయరక్షణకొరకు ,
"ఋ"ణంతీర్చుకోలేంఈసమయంలోపారిశుధ్య ,వైద్య ,ఆరోగ్య ,రక్షకభటనిలయసిబ్బంది సేవలకు
"ఎ"క్కడవాళ్ళుఅక్కడేఉండడంశ్రేయస్కరం "మే "3 వరకు ,
"ఏ"మాత్రంసడలించినాచెల్లించుకోవాలిఊహించనిమూల్యం .
"ఐ "కమత్యంతోప్రధానిసూచించినబాటలోనడుద్దాం , ఈవింతవైరస్నుఎదుర్కొందాం .
"ఒ"క్కనివల్లఏమవుతుందనుకోవడంఅవివేకం,గడ్డిపోచలన్నీకలిస్తేకదలలేదు మదగజమైనా
"ఓ"ర్పు, సహనం ఈసమయంలోఎంతోఅవసరంఈపరిస్థితుల్లో .
"ఔ"రాఅనిపించుకొనేలాపదుగురికిమార్గదర్శకంగామెలగడమేవివేకవంతులలక్షణంఈ...... . ఆపత్కాలంలో
"అం "తఃకరనాలనుశుద్ధిచేసుకొందాంఇంట్లోనేఉండిధ్యానంలో,
"క "కావికలమవుతుందిజాతియావత్తుఈవైరస్వ్యాప్తితో ,
"గ "మనించాలిప్రతీక్షణంఈవ్యాధిగ్రస్తులైనవ్యక్తులలో,

"ఘం "టాపదంగాచెప్పగలందీనినుండిబయటపడగలమనినియంత్రణాసూచనలన్నీ...............తప్పనిసరిగాపాటిస్తే ,

"చ "ల్లనిపదార్థాలను, ఏ.సి . వాడకాలనుతగ్గించు,వేడివేడిఆహారపదార్థాలనేభుజించు,

"ఛ"త్రంలాకాపాడగలదునిన్ను నీస్వీయగృహనిర్బంధమేఈవిపత్కరపరిస్థితిలో,

"జ "నులుగుమిగూడడంసర్వత్రానిషేధం,ఈవైరస్వ్యాప్తికిఅదేకదాఅనుకూలం .

"ఝ"షంనీటఉంటేనేదానికిమనుగడ, ఇల్లుదాటితేలేదునీకు "మనుగడ ",

“ట”క్కరినినేననుకోవడంనీతెలివితక్కువతనంఅనిమరువకు ,కమ

"ఠ"ములాఆపదఎదురైనప్పుడుఅంగాలుదాచుకొన్నట్లు,నీవుఈసమయంలోఇంట్లోనే.......ఉండు .

"డ"గ్గుత్తికపడితేఅదేనీలోఅనారోగ్యాన్ని మరింతపెంచుతుంది.

"ఢ"మరుకంమ్రోగిద్దాంమనమంతాఈకరోనావైరస్ని యంత్రణకైఏకత్రాటిపై,అ

"ణ"గారినపేదజీవులనుఆదుకొందాంమానవతాదృక్పథంట్

"త "రతమభేదాలులేవుఈవైరస్వ్యాధివ్యాప్తికిఇలలో,క

"థ"నాలన్నీ నిజమనినమ్మిఆలోచించకుఅమితంగామదిలో,

"ద"గాపడ్డవారుఎక్కువగారెక్కాడితేగానిడొక్కాడనికూలినాలిజనాలే,

"న"గుబాటుతెచ్చేవిధంగాప్రవర్తించకు, నలుగురిమేలేసతతంకాంక్షించు,

"ప"రాయిదేశాలనుండివచ్చినవారిద్వారావ్యాపించిందిఈమహమ్మారిమనకు ,

"ఫ"లితంఅనుభవిస్తున్నాంఈవ్యాధిగ్రస్తులసంఖ్యపెరుగుదలతో,లేదుమనకుకంటిమీద........కునుకు .

"బ"తికుంటేబలుసాకైనతినవచ్చనికాలినడకనచేరుకొంటున్నారుస్వగ్రామాలకువలస........వెళ్లినజనం .

"మ"సలవద్దంటున్నారుఎల్లరుబయటఅనవసరంగాఅత్యంతప్రమాదమని,

"య"థేచ్ఛగాతిరుగుతున్నారుకొంతమందిజనంనిర్లక్ష్యంగామేమేగొప్పోళ్ళమని,

"ర"వ్వంతైనాలేదుభయంకొందరికివారిప్రవర్తనఅత్యంతప్రమాదకరమని,

"ల"యతప్పిదొరికినప్రతీజీవినితింటేచెడదా "ప్రకృతిసమతుల్యత"?

"వ"క్రభాష్యాలుచెప్పకు, ఎవరుచెప్పినావినకు,అనవసరసందేశాలుపంపకు,

"శ"నిలాదాపురించిందిఈవ్యాధిఅనుకొనేకంటే, ప్రత్యామ్నాయమార్గాలతోఅంతమొందిద్దాం,

"ష"రామాములవుతుందినేటిపరిస్థితి "లాక్డౌన్ "ఎత్తేసాకవిచ్చలవిడిగాతిరిగితే,

"స"ర్వేజనాఃసుఖినోభవంతుఅన్నదిమనమతం, అందరూసమానమేఅన్నదేమానవత్వం.

"హ"లాయుధులేఇంటనుంటేమనకుగ్రాసంఎలాలభ్యం ?గ

"ళ"మువిప్పిపంపించండిమీఅభిప్రాయాలను,సూచనలనుకవులంతా,ప

"క్ష"పాతధోరణితోవ్యవహరించకండి "జనులబ్రతుకులతో ".

***

# 32. కరోనా వెళ్ళిపో

గుణుపురంగౌరీప్రసాద్,పాఠశాలసహాయకులురాజాం,శ్రీకాకుళం జిల్లా 9494778099

## కరోనా!.. నీకు శత కోటి దండాలు!

ఓ భూకంపంలా
తొలచి భూమిని బద్దలు చేయలేదు .
ఓ సునామీ లా ఎగసి నగరాలను ముంచెత్త లేదు.
ఓ గ్రహమై విరిగి భూ గోళాన్ని తాక లేదు.
ఓ అగ్ని పర్వతమై లావా వెదచల్ల లేదు.
అతి చిన్న విశ్వై,అన్నిటినీ మించిన విపత్తయి
నన్నే వాహనంగా, నా ఊపిరి హయంగా,
ప్రపంచ మంతా పరిభ్రమించావు.
నా మనుగడనే ప్రశ్నించావు.
లక్షల కోట్ల జీవ రాశులలో గొప్ప నాగరీకుడనని
అహంకరించాను.
భూగోళమంతా భుజాన మోయగల
బలశాలినని గర్వించాను.
మహా సముద్రాన్ని సైతం
ఈదగల వీరుడనని విర్ర వీగాను.
ఆకాశపుటంచులు దాటి,
సూర్య చంద్రులను తాకానని తెగ రెచ్చి పోయాను.
ఓ కరోనా!
నా మైక్రోస్కోప్ తో చూడలేనంత సూక్ష్మానివి.
నా అణ్వస్త్రము తో కాల్చలేనంత స్థూలానివి
నా రాకెట్ తో అందుకోలేనంత వేగానివి.
నా కంప్యూటర్ తో కొలవ లేనంత అనంతానివి.
నా మీద నీకెందుకింత పంతం
నా స్వార్థం కోసం సృష్టిని స్వాహా చేస్తున్నానని కోపమా,?
జీవజాలాన్ని నా కాలికింద తొక్కి పెట్టానని తాపమా,?
నా దురాగతాలను సహించలేక దేవుడిచ్చిన శాపమా,?
కాలుష్యానికి ప్రధాన కారకుడుగా
చేజేతులా చేసుకున్న పాపమా?
తెలుసు కున్నాను నేను,
ఇకనైనా క్షమించు నన్ను!
తెచ్చుకున్న విజ్ఞానం, పెంచుకున్న
సుజ్ఞానం ప్రకృతి పాదా ల ముందు చాలా అల్పమని,.?.
కూడబెట్టిన ధనం,వెలగబెట్టిన అధికారం
నాశనం కావడానికి ఒక్క క్షణం చాలునని...
మానవ అకృత్యాలకు,
ప్రకృతి శాసనమై ఉరిమితే
ఎదురించలేని అసమర్థుడనని...
ప్రాణం తియ్యడానికి ఏ వైరస్సో వెంట తరిమితే
ఏ వైద్యము దొరకదని...
ఓ కరోనా!
వినూతడ నైనాను నేను.
నీవు అదృశ్యంగా తిరుగు తున్నావని
ఓ మూల నక్కి నక్కి కూర్చొని తెలుసుకున్నాను.
బడుగు జీవుల వలస బతుక్కి
క్వారంటైన్ కేంద్రాలు ఆత్మ రక్షణ కొలువులని
పబ్బాలు,క్లబ్బులు, దబ్బులు కన్నా
ఇళ్లే అనుబంధాల నెలవులని,
ఆసుపత్రి కర్మయోగులే
అమృతం పంచే గరళ కంఠులనీ,
వీధులు శుభ్రం చేసే పారిశుధ్య కార్మికులే
ఆపద కాలంలో ఆత్మీయ సోదరులనీ,
భయపెట్టే రక్షకభటులు అభయ మిచ్చే ఆప్త మిత్రులని,
తెలుసుకుని
ఉన్న గర్వం ఊడిపోయి కన్ను తెరిచాను.
ప్రకృతి సమతుల్యం అమృతం కన్నా గొప్పదని,
వాతావరణ కాలుష్యం విషం కన్నా నీచమని,
గట్టి దెబ్బ కొట్టి పెద్ద పాఠం బోధించావు!
నా జీవన వేదంగా మలిచావు!
చేతులెత్తి మొక్కుతా కనికరించి వెళ్ళిపో...
కరోనా నీకు
శత కోటి దండాలు వెళ్ళిపో....



-జి.గౌరీ ప్రసాద్

## 33. గుణపాఠం

లఖనాపురం మణిభూషణరావు విశాఖపట్నం 9381251552

### గుణపాఠం.

- కరోనా నేర్పింది గుణపాఠాలను;
కలిపింది స్నేహం, సంబంధాలను;
తుంచింది అనారోగ్యపు అలవాటులను
నేర్పించింది మానవీయత విలువలను.

- దూరపు కొండలు నునుపని తెలుసుకో;
సొంత గూటిలో వలసపక్షి సేద తీర్చుకో;
విదేశీ మత్తును వదిలించుకో;
స్వదేశీయతపై ఇష్టం పెంచుకో.

— డా మణిభూషణ్

# 34. నారాయణాస్త్రం

## దుర్గుమహంతి మోహనరావు హైదరాబాదు9494941589

కలం స్నేహితులు కరోనా పై కవిత సంకలనం కోసం శ్రీ ఐయుతులు శ్రీ సదాశివుని లక్ష్మణ రావు గారికి 9247783307

నారయణాస్త్రం

దుర్గుమహాంతి మోహన రావు cell 9494941589

అమ్మా ! భారతమాత నమస్కారం !నమస్కారమే మన సంస్కారం !!,
సూర్యనమస్కారాలు , సంధ్యావందనాలు మన సాంప్రదాయం! అదే మన జీవన వేదం !/
ఇంట్లోనే ఉండండి వంటింటి వంటకాలు తినండి .క్షేమంగా లాభంగా ఉండండి
కొత్తగా తిరిగి రాస్తున్నారు ఊతరం !! అదొక్కటే కరోనాకి నివారణ వరం !!/
పసుపు కుంకుమ గంధం దూపం దీపం మన సంప్రాదయానికి ప్రతీకలు
ప్రాణవాయు రక్షణకై తులసి వేప రావి మామిడి మారేడు చెట్లకు ప్రదక్షిణం !!
కాళ్ళుచేతులు కడుక్కొని భోజనం , చెప్పులువిడచి గృహ, దేవాలయాల ప్రవేశం
తాత అమ్మమ , బామ్మ అమ్మ నాన్న అక్కాచెల్లెళ్లు , అన్నదమ్ముళ్ల బంధువర్గ సమావేశం
అందరు కలసిమెలసి చేసుకునేదే పండుగ , అదే మన సాంప్రదాయం /
పప్పు అన్నం ,రోటి పచ్చడి, కూరగాయలు ఏ పూట వంట ఆ పూటకు మన ఆహారం /
నీవు చెప్పిన మాటలు శుచి శుభ్రత మడి ఆచారాలు పెడచెవిని పెట్టామమ్మా !/
అసలు ఇంట్లో వంటా వార్పూ లేనేలేదు , అన్నీ రోడ్డు పక్కన వంటకాలే
నడక ,పడక మరచి, అందని వాటికోసం అర్రులు చాచటం/
అలుపెరుగని పరుగు !! అందిన వాటిలో తృప్తి లేక పోవటం !!
ఎక్కడో లెక్క తప్పిందమ్మా !! అగ్ర రాజ్యాలకి అంతర్జాలానికి అందుచిక్కని అజ్ఞాత శత్రువు !!/
'కరోనాస్త్రం'గా ప్రపంచ దేశాల్ని పట్టి కుదిపేస్తోంది ! అజ్ఞాతవాసంలో నున్న పాండవుల్లా
మనమంతా ధైర్యంగా, స్వచ్ఛందంగా భౌతిక దూరం పాటించి ," నారాయణాస్త్రానికి" కట్టుబడి
దైవానికి శరణాగతి కోరి, కరోనా రహిత భారతావనిగా తీర్చిదిద్దుదాం !!

)))OO(((

Address: DURGUMAHANTHI MOHANA RAO HNO.1-7-15/3/F303, VAMSI KUTEER APT , SOUTH KAMALANAGAR , ECIL POST HYDERABAD 500 062

# 35. యమపురి లో లాక్ డౌన్

## ఎవిఎస్ పట్నాయక్ విశాఖపట్నం 77805 92451

యమ : చిత్రా ఏమీ ఇన్నిన్ని నరసమూహాలను ఎడతెరిపి లేకుండా తెస్తున్నారు మన వాళ్ళు?
లెక్కలు సరిగా చూచుచుంటివా? లేదా?

చిత్ర : ప్రభూ అవి అన్ని అకాల మరణాలు. మనము తీసుకొచ్చునవి కావు. వాళ్లంతట వాళ్లే వచ్చుచున్నారు. మన లెక్కల ప్రకారం యింకొక పది సంత్సరాల తరువాత రావలసిన వాళ్లు వీళ్ళందరూ.

యమ : అది ఎటుల సాధ్యము?

చిత్ర : కరోనా అనే ఒక అదృశ్యఅణునిర్జీవి భులోకమంతా తిరిగి తిరిగి నరులను సాముహికముగ మన దగ్గరికి పంపివేయుచున్నది ప్రభూ.

యమ : భళా భళి! అదృశ్యనిర్జీవి అనుచున్నావు. దానిని చంపక, నాశనం చేయక, వాళ్లే చని పోవుచున్నారేలా?

చిత్ర : వారి ప్రయత్నం వారు చెయుచున్నారు. కానీ దానిని చంపడానికి ఏ ఆయుధమూ లేదు. ఏ ఔషధం లేదు.

యమ : అటులయినా మిక్కిలి పని భారం మనము భరించలేము కదా.

చిత్ర : ప్రభూ అందుకే మన యమలొకం లాక్ డౌన్ ప్రకటించి మన ద్వారములన్ని మూసివేయుదము.

యమ: కొత్తగా ఉందే? లాక్ డౌన్ ఆనిన ఏమి.

చిత్ర : లాక్ డౌన్ అనిన మరేమీ లేదు ప్రభూ. అన్నీ మూసి వేసి మన కోటలో మనం ఉండడం. మనకి కొంత విశ్రాంతి దొరకును కదా ప్రభూ. భూలోకంలో కూడా అన్ని దేవాలయాలు మూసి వేసినారు.

యమ : కరోనా యిక్కడికి వచ్చునా ఏమి? వచ్చినా మనకేమి చేయును? మరి మనకి ఎందుకూ యి లాక్ డౌన్ గోల?

చిత్ర : ప్రభూ కరోనా నరులు యిక్కడికి వచ్చుచున్నారా! దాని వలన మన యమ లోకం అంతా కరోనా రోగం సోకుతుంది.
యమ : ఐనా మనకేమి యగును?
చిత్ర : నేను యముండ. నేను చిత్రగుప్తుండ ఆనిన అది వినదు ప్రభూ. ఆ కరోనానరులను శిక్షిస్తూన్నప్పుడు మన ఇద్దరి భటులకి కుడా కరోనా సోకినది ప్రభూ.

యమ : అటులనా? మన పురములొనె మనం ఉండెదము గాక. యమపురి భటులారా కరోనా నిర్జీవమూ అదృశ్యము

కావునా, ముఖ కవచములను నిత్యమూ ధరించుము. నిత్యమూ హస్త శుద్ధి చేయచుండుము. నిత్యమూ ఉష్ణ జలం సేవించుము. నాలుగడుగుల భౌతిక దూరం పాటించుము. మీ పొలిమేరలు దాటవలదు మీ గృహమే మీకు సురక్షితము. భూవాసులారా మా లెక్కల ప్రకారం మీకు కూడా పూర్ణ అయుస్సు కలదు. కరోనా భారినపడి భయపడి తొందరగా ఇచ్చోటకి రావలదు. సర్వే జన సుఖినో భవన్తు. 28-4-2020

***

## 36. సమిష్టిగపోరాడండి-కరోనాను తరమండి

## సదాశివుని లక్ష్మణరావు వైజాగు 9247783307

బంధువులు,మిత్రులు

ఆప్తులు,భాగస్వాములు

తోబుట్టువులు,అమ్మానాన్నలు,

పక్కింటివారు ఒకే వీధివాళ్ళు

తోటి మార్నింగు వాకర్స్

ఆఫీసు కొలీగ్స్,గురువులు

ఎపుడూసాయం అందించడానికి

ముందుండే సేవాతత్పరులు

ఒకరనేమిటి అందరూ

ఒకరితరవాత ఒకరు

క్షణంలో మాయమైపోతుంటే

పిట్టల్లా రాలిపోతుంటే

నామనసు కకావికలమ

వకుండా ఎలా ఉంటుంది?

కరోనామహమ్మారి

ఘోరవిలయతాండవం

ఆపడానికి ఎవరూలేరా?

ఎన్నాళ్ళీ మారణహోమం?

దేవుని నమ్ముకున్నవారు

దైవాన్ని ప్రార్థించండి విడవకుండా

రేపుంటామో అనేది

అపనమ్మకమైనా

అసూయలు,కక్షలు

స్పర్ధలతో దేశాలను

కబళించడం ఆపండి

మంచిరోజులొచ్చాక

ఆ పనులెలాగూ చేద్దురుగాని

మంచివారినే ముందుతీసు

కెళ్తున్నట్టు కనిపిస్తున్నా

అందరిని సమానంగా

తీసుకుపోతున్నట్టుంది

ఈ కరోనామహమ్మారి

కట్టడికి చేయిచేయికలపండి

మనసుపెట్టి పనిచేయండి

మానవశక్తికి తిరుగులేదని

నిరూపించండి

అందరికీ అంటరానితనం

ఎంతబాధాకరమో

తెలియజెప్పింది

ఇంక అంటరానితనాన్ని

వదిలేస్తారుగా?

పోయిన వారందరికీ

మిత్రుడైనా శత్రువైనా

సద్గతులు కలగాలని

మనస్ఫూర్తిగ ప్రార్థన చేయండి.

మిగిలి ఉన్నవారికి

సంపూర్ణ ఆరోగ్యాన్నిమ్మని

కూడా ప్రార్థనచేయండి

సమయంలేదు మిత్రమా!

మీరు చేయాల్సిన మంచిపని

ఈ రోజే చేసేయండి.

***

## 37. కరోనా మాధ్యమం

పి.లక్ష్మణ్ రావ్  అసిస్టెంట్ రిజిష్ట్రార్ సహకార శాఖ విజయనగరం  9441215989

చక్కర్లు కొట్టే
వాట్సాప్ సందేశంలా
ఒకరి నుండి మరొకరికి
కరోనా! నీ వ్యాధి గమనం !
అందంతో ఆకర్షించే
ముఖపుస్తక చందంలా
కరోనా! నీది అదృశ్య మోసం !
అంతర్జాల వశీకరణంలా
నీ అస్త్రం సమ్మోహనం
పైపై చక్ర పరిధిలా
నీ ఆయుధం భూభ్రమణం !
మనిషిని గణన యంత్రం చేసుకొని
కూడికలు,తీసివేతలు,గుణకాలతో
ఎక్సెల్ గడులు నింపుతున్నావు
మీటల పలక అక్షరాలతో
శర సంధానం గావించి
గుప్పిట్లోని సాంకేతిక ఎలుకతో
త్రిప్పుతున్నావు చక్రాయుధం !
స్విచ్చాన్, స్విచ్చాఫ్ నీ చేతిలోనే
ఆదేశ నియంత్రణలూ నీ ఆధీనంలోనే !
నిఘా నేత్రాలకూ చిక్కడంలేదు
సెన్సర్ చెవులకూ దొరకడం లేదు !
క్రోమ్ ఆకారంలా
భూగోళం నీకో రంగుల రాట్నం
సెట్టింగ్స్ చక్రంలా
భూమండలం నీకు నాడీతంత్రం !
యూట్యూబ్ దరఖాస్తులా

నీది చిత్రవిచిత్ర కధనం

వార్తల మాధ్యమంలో

ఇరవై నాలుగు గంటలూ,ఏడు రోజులూ

నీదో విశ్వరూపం !

ఏదైతేనేం ? కరోనా !

ట్విట్టర్ సందేశంలో

నీవొక సెలెబ్రిటీ

గూగుల్ అన్వేషణలో

నీదొక చరిత్ర పుట !

***

గణన యంత్రం =computer

మీటల పలక=key board

సాంకేతిక ఎలుక=Computer mouse

ఆదేశ నియంత్రణలు=remote control

నిఘా నేత్రాలు=CC Cameras

గూగుల్ అన్వేషణ =Google search

## 38. నేనో దౌర్భాగ్యుణ్ణి

గొడబ లోక మోహనరావు పట్నాయక్. విశాఖ 89 850 99 541.

నేనో చవటను..నేనో అవిటిని

నేనో స్వార్థాన్ని..నేనో రాయిని

మనసు లేని మనసుని....

ఎవరికీ ఏవిధంగాను ఉప యోగపడని వాణ్ణి.

నే నెందుకు పుట్టాను ఎందుకు జీవిస్తున్నాను. ఎవరికి ఉపయోగం.!?.

దేశానికి ఏమిచ్చాను..?

రాష్ట్రనికి ఏమి చేసాను..?

గ్రామానికి ఏమి చూపాను.?

ఎవరికైనా ఏవిధంగానైనా

ఉపయోగపడ్డానా..?

కరోనాను అంతమొందించాలని

రాత్రింబవళ్ళు ప్రయోగాలు చేస్తున్న సైంటిస్టులు....

కనీసం ఆప్రయోగశాలనైనా

శుభ్రపరచానా..!

కరోనాబాధితులను ప్రాణసమంగా కపాడుతున్న డాక్టర్లు...

కనీసం వారకోటునైనా ఉతికి పెట్టానా..!

అహోరాత్రులు సేవలుచేసే నైటింగేల్స్నర్సులు..

కనీసం వారిబూట్లకు లేసు తొడిగానా..!

ప్రజలక్షేమమే లక్ష్యమని ఎండలోనే మాడుయున్న పోలీసులు.

కనీసం వారిఎండకు గొడుగు పట్టానా..!

వీధివాడలు శుభ్రపరిచే సత్యమైన కార్మికులు...

కనీసంవారిచేతికి చీపురిచ్చానా..

ప్రజలఆకలిబాపి బ్రోచే అన్నదాతలు రైతన్నలు..

కనీసం వారి నాగలి మోసి తెచ్చానా..!

ఎందరో మరెందరో స్వచ్చంద సేవకులు...

ఆపన్నహస్తాలు

కనీసం ఆ హస్తాలకైనా తోడు నిలిచానా..!

ఎవరికీ ఏవిధంగాను ఉపయోగ పడని వాణ్ణి ..నేనో దౌర్భాగ్యుణ్ణి

***

# 39. కరోనా భయం.   హైకూలు

## శేఖరమంత్రి ప్రభాకర్ పూనే, మహారాష్ట్ర 9885874474

1
కరోనా భయం

బంధాలు విచ్ఛిన్నం

చిరునామా లేని

మానవత్వం

2
దైవదర్శనానికి

వెళ్ళేడు

కరోనా వరంతో

తిరిగొచ్చేడు

3
నా అన్నవాళ్ళే

నో అనే దుస్థితి

కరోనా ఇచ్చిన

సంస్కృతి

4
పెద్ద వాళ్ళకు పేదవాళ్ళకు

వేరే వైద్యశాలలు

వివక్షత

విశ్వరూపం

5
కరోనా మందులు

బ్లాక్ మార్కెట్లో

మంట గలసింది

మానవత్వం

6
ఎదుటి వారిని

శత్రువుగా చూచే దుస్థితి

కరోనా తెచ్చిన

విచిత్ర స్థితి ....

# 40. హైకూల టీకా

## గౌరిప్రసాద్ కరకవలస. గాజువాక 9440326093

**1.ప్రభాతవార్త**
**టీకా వచ్చేస్తోందిలా**
**కరోనా పైకి...**

**2.మొదటిదశలో**
**ఆక్స్ఫర్డ్ లోవ్యాక్షిస్**
**విజయవంతం..**

**3.భారత్ భయో**
**కోవాక్జిస్ పేరుతో**
**వేగవంతమై..**

**4.పరీక్షలకై**
**పెద్ద నగరాలలో**
**టీకా ప్రారంభం..**

**5.ప్రయోగానికి**
**ముందుకోచ్చిన వార్కి**
**ప్రణామములు....**

**6.విజయవంతం**
**రష్యాటీక సిద్ధంగా**
**వచ్చేనెలలో....**

**7.ఎపుడెపుడా**
**టీకాని చూస్తూ న్నాం**
**ఎదురుచూపై..**

**8.దేవుడానీవే**
**మాకుదిక్కని చెపుతూ**
**దిక్కులు చూపే...**

**9.అంతిమ తీర్పు**
**కరోన అంతంకోసం**
**పంతంతో అంతా...**

***

# 41. జయం నీదే

తిరుపతిరావు గంద్రేటి, విజయవాడ. 9701373708

నవ జీవనసమాజ సౌధాన్ని నిర్మించి నిర్భయంగా
నిలబడే ఓ .. మానవీయా!
ఎందుకు వెనుకకు అడుగు వేస్తూ ఉన్నావు!
ఏమైందని.....? నీకు ఏమైందని.....?
నీ గుండె చప్పుడు లో తేడా వచ్చిందా...?
నీ నడతలో మార్పు వచ్చిందా?
నీ మనసు అధైర్యాన్ని నూరి పోస్తుందా?
నీ ధైర్యం సన్నగిల్లిందా?
నిన్ను ప్రోత్సహించే వారు కరువయ్యారా?
కష్టాలు, బాధలు, దీనగాధలు,దయార్ధహృదయాలు,
మనస్థాపాలు, ప్రేమలు, సంతోషాలు కోల్పోతావు అనే భయం కలుగుతుందా?
కనికరింపని కరోనా ఒక రోజు కాళరాత్రి అయి
నిన్ను కభలిస్తూందని తలపిస్తున్నావా?
ఎన్ని కష్టాలు భరించి జనుల బాధలు తీర్చే
నీకు భయమా
ఎన్ని త్యాగాలు చేసి పోరాటాల్లో మిగిలి
జీవిస్తున్న నీకు భయమా?
ఎన్ని గుణ పాఠాలు నేర్చుకున్న నీవు బ్రతుకు కు
భయపడుతున్నావా?
ఎన్నో అవాంతరాలు ఎదుర్కొనే నీలో చేవ
తగ్గింది అని వెనుకంజ వేస్తున్నావా?
భీతిల్లుతున్నావా..?
ఏమయింది నీ ధైర్యం...ఏమయింది నీ సాహసం?
నీ నిరుపమాన ఆత్మ విశ్వాసం ఏమయింది?
నిన్ను నీవు నిలదొక్కుకో
నీ ధైర్యాన్ని కూడగట్టుకో
బ్రతుకు బండిని నిర్భయంగా ముందుకు సాగనీ..

దీన్ని మహమ్మారి అనే కంటే మనలో ధైర్యాన్ని

నింపే దేవత అనండి.

ఈ దేవతను ఎదిరించాలంటే...

నీకు కావలసిన ఒకింత ధైర్యం, నిండైన ఒంటరితనం

తెగువ కావాలి.. నిలిచే ధమ్ము కావాలి.

వ్యాధిగ్రస్తుల పట్ల ప్రేమ కావాలి, వారికి ధైర్యాన్ని

నూరి పోయాలి, మానవతాదీపం వెలిగించాలి.

దేశ భక్తుడు తాను ఉరికంభం ఎక్కినా చావుకు

భయపడడు. తన ఊపిరి ఆగినా వెరవడు. ఆత్మ

నిబ్బరంతో తన ప్రజల క్షేమాన్ని కోరుతాడు, వారికి

ప్రేమ ను పంచుతాడు.

బిడ్డ ను రక్షించే పక్షి తన త్యాగంతో తాహతు మించి పోరాటం చేస్తుంది

ఎన్ని మార్లు తన గూడు విరిచినా అలసి పోక మరల పునర్నిర్మాణాన్ని ప్రారంభిస్తుంది.

సృష్టి కార్యాన్ని మొదలు పెడుతుంది.

వెరవకూడదు, వెనుకకు తగ్గ కూడదు.

ముందు కూ పో ఈ విశాల విశ్వం నీకు తోడుంది.

చీకటి తొలగిపోవటానికి వెలుగు ప్రయత్నం

చేస్తునే ఉంటుంది. సఫలీకృతం అవుతుంది.

ఇది చీకటి వెలుగుల పోరాటం.

భయపడకు,

అడుగులు ముందుకు వేయు. జయం నీదే.

***